


## కాలేజీలో ఉపన్యాసం

ఇది మార్చి నెల, కళాశాల వార్షికోత్సవాల సీజను. మీరు రచయితలనో, మంచి గాయక శిఖామణులనో, స్టేజీ నటులనో, తెలుసుకుని ఆ నాలుగయిదు రోజుల కార్యక్రమంలో ఒకరోజు మీ ఉపన్యాసం ఏర్పాటు చేస్తారు. మీరందుకు అంగీకరించి వెళ్ళే ముందర కొన్ని జాగ్రత్తలు తీసుకోవలసి వుంటుంది.

మీ ఉపన్యాసంలో పెద్ద పెద్ద పదాలు వాడి, శాస్త్రాన్ని చెప్పేరో కుర్రాళ్ళు మీ గాలి తీసేస్తారు. మీరెంత గొప్పవారయినా కావచ్చు. దే డోంట్ కేర్. మీనుంచి ఏదో తెలుసుకోవాలని వాళ్ళు మిమ్మల్ని పిలువలేదు. మీరెట్లా మాట్లాడుతారో తెలుసుకుని మీకు మార్కులు వేసి పంపుతారంతే.

మీ విజ్ఞానంగాని, మీ విద్వత్తుగాని వాళ్ళ ముందర ఏమాత్రం గూడా పనిచేయవు. వాళ్ళని కంట్రోల్ చేయడం తలకు మించిన పని. వాళ్ళతో సంవత్సరం పొడుగూ తామెంత ఇబ్బంది పడుతున్నామో అనుభవ పూర్వకంగా తెలుసుకోండని లెక్చరర్లు మీలాంటి పెద్దలను ఆహ్వానిస్తారని కూడా మీరు అర్థంచేసుకోవాలి. ఆ మాటకొస్తే అక్కడి లెక్చరర్లు మీకంటే గొప్పవారే. సగం బ్రతుకు చదువుకోడానికి వినియోగించి, మిగతా సగం చదువు చెప్పడానికి సిద్ధపడ్డ ఆ మహనీయులు రెండో సగంలో ఎంత అవస్థ పడిపోతున్నారో మీరు అర్థం చేసుకుంటే కాలేజీల్లో గంభీరోపన్యాసాలు చెల్లవని ఆటోమేటిగ్గా తెలుసుకుంటారు.

ఒక వేదికమీద మీతోపాటు మరో నలుగురు వక్తల్ని ఎక్కిస్తారు. "ఉపన్యాస పోటీలో" మిమ్మల్ని యిరికించేస్తారు. మీవంతు వస్తేగాని తెలీదు ఆ పోటీలో మీరు యిరుక్కున్నట్టు. మీకంటే మరో వక్త స్టూడెంట్స్ని ఆకట్టుకునే విధంగా మాటాడుతున్నప్పుడు మీకు ఏడుపొస్తుంది. మీకంటే అతను ఎక్కువ జోకులు వేసి నవ్విస్తుంటే, మీకు అక్కడ్నుంచి పారిపోదామనిపిస్తుంది. పారిపోవడానికి వీల్లేకుండా అటూ ఇటూ స్టూడెంట్స్ నిలబడి వుంటారు. కుర్చీలోంచి లేస్తేచాలు, మీ దగ్గరకువచ్చి ఎంతో గౌరవంగా ఏం కావాలని అడుగుతారు. పారిపోవాలని వుందని మీరు చెప్పలేరు. పారిపోయే అవకాశం వాళ్ళు మీకు యివ్వరు.

ఉపన్యాసానికి వెళ్ళేముందు కాలేజీవాళ్ళు పంపిన కారు, మీ యింటిముందు ఆగినప్పుడు మీకు గొప్పగానే వుంటుంది. ఇంటిల్లిపాదీ మీతోపాటు నాలుగడుగులు నడిచి మిమ్మల్ని కారెక్కించినప్పుడు మీ ఛాతి ఉప్పొంగే మాట ఎంతో నిజం. వెనకసీటు దగ్గర తలుపు బి.ఎ. చదివే కుర్రాడు తెరిచి వినయంగా నిలబడినప్పుడు మీ గొప్పతనానికి అతను అద్దంలాగానే పని చేస్తాడు.

మీరు కార్లో ఠీవిగా కూచోగానే కారుస్టార్టవుతుంది. మీ పిల్లలు మీకు టాటా చెబుతుండగా....మీ ఆవిడ మీవేపు గర్వంగా చూసి పిల్లల్ని ఇంట్లోకి తీసుకెడుతుండగా....ఆహా ఏమి నా జన్మ అనే పాట మీ గుండెను మైకుగా చేసి మీకు వినిపిస్తుంది. కార్లో కూర్చుని అట్లా అట్లా గాల్లో తేలిపోతూ కళాశాల ఆవరణలోనికి దయచేస్తారు. సెక్రటరీ మీకు నమస్కరించి మెల్లగా తలుపు తెరుస్తాడు. చంద్ర లోకంలో తొలిసారి అడుగుపెట్టిన మానవుడికి మల్లే గొప్ప ఆనందంతో కారు దిగి నేలమీద అడుగు పెడతారు. మీకు తెలిసినవాళ్ళూ....తెలీనివాళ్ళూ మీకు చేతులు జోడిస్తుంటే ఇట్లాంటి కార్యక్రమాలు నెలకో ఇరవై చొప్పున తగుల్తే బావుండనిపిస్తుంది.

మీకు స్వాగతం పలికే బేనర్లు చూస్తారు. ఓహో అనుకుంటారు. ప్రిన్సిపాల్‌గారు కరచాలనం చేసినపుడు ఆహా అనుకుంటారు. ఆడపిల్లలు కూడా వుంటారు మరి. వాళ్ళవేపు చూడడం మర్యాద కాదని మీకు తెలుసు. కాని మనసుకి ఆ బుద్ధెక్కడిది? వుండీ వుండీ దొంగ చూపులు చూస్తారు. ఏ ఇద్దరాడపిల్లలు ఏం మాట్లాడుకుంటున్నా, అది మీ గురించేనని గట్టిగా నమ్ముతారు, మీకు ప్రత్యేకించి వేసిన కుర్చీల్లో కాళ్లూపుకుంటూ. అంతవరకూ యెంతో బాగానే వుంటుంది. ఆ తర్వాత ప్రతిక్షణం ఒక ఆటంబాంబు అవుతుంది. మీ గుండె ధైర్యాన్ని సవాలు చేస్తుంది.

మీరు వేదిక ఎక్కగానే ఎవడో కసిక్కున తుమ్ముతాడు. అతను తుమ్మిన కారణం ఏదైనా, అది మిమ్మల్ని ఉద్దేశించి వేసిన బాణమేనని మీరనుకుంటారు. వేదిక నలంకరించిన పెద్దల్ని పరిచయంచేసే సందర్భంలో మీ పేరు చదవగానే పిల్లికూతలూ వగైరాలు ప్రేక్షకలోకం సరఫరా చేస్తుంది. అవికూడా మిమ్మల్ని ఉద్దేశించి ప్రయోగించినవేనని మీరు నమ్మతారు. దాంతో దడ ప్రారంభమవుతుంది. సెక్రటరీ రిపోర్టు పఠనం జరుగుతుండగా ప్రేక్షకుల్లో అసహనం పేట్రేగి పోతుంది. వాళ్ళ అసహనం తారాస్థాయి చేరుకున్న తర్వాత మిమ్మల్ని మాట్లాడమంటారు.

కార్లో వస్తుండగా ఏమేమి మాట్లాడాలో మీరు మననం చేసు కుంటూనే వచ్చేరు. ఎందుకయినా మంచిదని చిన్న కాగితంమీద కొన్ని పాయింట్లు చూడా రాసుకున్నారు. ధైర్యంగా మీరు అధ్యక్షా!అనగానే ఎవడో 'బోర్' అంటాడు. ఆ దెబ్బకి మీ నాడి ఆగిపోతుంది. ఏం చెప్పదలుచు కున్నారో మొత్తం మరచిపోతారు. కాగితంమీద అక్షరాలు సైతం కనపడవు. కాళ్ళు వణుకుతుంటాయి. చేతులు స్వాధీనం తప్పుతాయి. మైకుని గట్టిగా పట్టుకుని వణుకును తగ్గించుకుందామనుకునే మీ ప్రయత్నం మంచినీళ్ళ గ్లాసుని తన్నేస్తుంది. గ్లాసు నేలమీదపడి భళ్ళున పగుల్తుంది. ఈ ఫీటు ముగియగానే 'దిగూ' 'దిగి పో' అనే కేకలు దిక్కులు మార్మోగేలా విని పిస్తాయి. ఇంకేం రాయను? మీ కష్టాలు అనంతం